## దిశా నిర్దేశం

**తెలంగాణభవన్‌లో** బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం మంగళవారం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించారు. సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.




రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలో నెర్రెలు బారిన వరి పొలం

# అందని నీటితడి.. రైతన్న కంటతడి!

- యాసంగిలో సాగునీటి కష్టాలు
- ఎండుతున్న పంటలు..
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోర్లు..
- పట్టించుకోని అధికారులు

### కౌలు రైతు కన్నీటిగోస

రామారెడ్డి (సదాశివనగర్), మార్చి 11: సదాశివనగర్ మండలం భూం పల్లి గ్రామానికి చెందిన మొగ్గం రమేశ్ అనే రైతు మూడున్నర ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పంట వేశాడు. పంట పొట్ట దశలో ఉండగా బోరు ఎత్తిపోయింది. చుక్కనీరు రాక పోవడంతో ఇటీవల కొత్త బోరు వేయించాడు. అది కూడా ఫెయిల్ అవడంతో పంటంతా ఎండిపోయి, పొలం నెర్రెలు బారింది. ఏం చేయాలో తెలియక ఆందోళన వ్యక్తంచేస్తున్నాడు.

బీబీపేట్(దోమకొండ), మార్చి 11: ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు చేతికందే దశలో ఎండిపోతున్నాయి. సాగునీరందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటకు నీటి తడులు అందక ఆగమాగమవుతున్నారు. కండ్ల ముందే ఎండుతున్న పంటలు కంటనీరు తెప్పిస్తున్నాయి. వేసవికి ముందే ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. యాసంగి సాగులో చివరి తడులకు నీళ్లందక ఎండిపోవడం చూశామని, కానీ పంట పొట్టదశలోనే నీరందక ఎండిపోవడం ఇదే మొదటిసారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎండిపోతున్న పంటను కాపాడుకోలేక రైతులు నానా పాట్లు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్లపై ఆధారపడి పంటలను సాగుచేస్తున్న రైతులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. బోర్లు ఎత్తిపోవడంతో మడులు వదిలేసి ఆశలు వదులుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంతోపాటు అంచనూర్, సంగమేశ్వర్, లింగుపల్లి, గొట్టిముక్కల, అంబారీపేట, సీతారాంపల్లి తదితర గ్రామాల్లో వరి పంటకు నీటి తడులు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో బోర్లు సరిగ్గా పోయడంలేదు. పంటలను కాపాడుకోవడానికి మరో బోరు తవ్వించినా చుక్కనీరు రాకపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడై అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. మరోవైపు రాత్రివేళలో విద్యుత్ సరఫరా చేస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కొన్ని గ్రామా ల్లో పంటలకు నీరు అందకపోవడంతో ఆశలు వదులుకున్న రైతులు, పంట పొలాల్లో గేదెలను మేపుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



### పొట్టదశలోనే నీరందక..

ధర్పల్లి, మార్చి 11: మండలకేంద్రంలోని మోతె వెంకటి అనే రైతుకు చెందిన పొలం సాగునీరందక ఎండిపోయింది. వేసిన పంటలను కొందరు అలాగే వదిలేయగా.. మరికొందరు రైతులు సగం పంటలనైనా కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.



దోమకొండ నుంచి సంగమేశ్వర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో ఎండిపోయిన పంట

### ఎండిన పంటలను పరిశీలించిన కలెక్టర్



సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ఎండిన పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్పల్లి/ సిరికొండ, మార్చి 11 : ధర్పల్లి, సిరికొండ మండలాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం పర్యటించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ఇందల్వాయి రోడ్డు, దుబ్బాక రోడ్డుతోపాటు సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. బోర్ల కింద, ఆయకట్టు కింద సాగవుతున్న పంటల వివరాలతోపాటు పంట పొలాలు ఎండిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆరుతడి పంటలు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. పలువురు రైతులు తమ గోడును కలెక్టర్‌తో వెల్లబోసుకున్నారు. సిరికొండ మండలంలో సుమారు 300 ఎకరాలు ఎండిపోయాయని ఏవో నర్సయ్య తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఏడీఏ వీరస్వామి, తహసీల్దార్లు మాలతి, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

**పసుపు రైతులను మోసగిస్తే కఠిన చర్యలు**

కంఠేశ్వర్, మార్చి 11: పసుపు పంట కొనుగోళ్లలో రైతులను ఎవరైనా మోసాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హెచ్చరించారు. జిల్లా మార్కెట్ యార్డులో పసుపు పంట విక్రయాలపై పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పసుపు విక్రయాల సందర్భంగా రైతులకు ఏ దశలోనూ నష్టం వాటిల్లకుండా, వారు మోసాలకు గురికాకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పసుపు క్రయవిక్రయాలపై పరిశీలన కోసం అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. అదనపు కలెక్టర్ కూడా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.

# చెరువు కోసం రెండు ఊర్ల కొట్లాట

- మాజీ స్పీకర్ పోచారం ఇలాకాలో వివాదం
- రోడ్డెక్కిన లక్ష్మాపూర్ గ్రామస్తులు
- రోజంతా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు



వివాదానికి కేంద్రంగా మారిన చెరువును పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు, ఏసీపీ శ్రీనివాస్, పోలీసులు

చందూర్, మార్చి 11: మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇలాకాలోని ఓ చెరువు కోసం రెండు గ్రామాలు కొట్లాటకు దిగడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం అర్ధరాత్రి మొదలైన వివాదం మంగళవారం సాయంత్రం దాకా కొనసాగింది. చివరకు అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో ప్రస్తుతానికి పరిస్థితి సద్దుమణిగింది. నిజామాబాద్ జిల్లా చందూర్ మండలంలోని లక్ష్మీసాగర్ చెరువుపై లక్ష్మాపూర్ గ్రామస్తులకు 60 శాతం, లక్ష్మీసాగర్ తండా( మేడ్‌పల్లి) వాసులకు 40 శాతం వాటా ఉన్నది. అయితే, సోమవారం రాత్రి వేళ లక్ష్మీసాగర్ తండా వాసులు కొందరు చెరువులో చేపలు పడుతుండగా, లక్ష్మాపూర్ గ్రామస్తులు పట్టుకున్నారు. ఈ క్రమంలో ఇరు గ్రామాల మధ్య వివాదం రాజుకోగా, పోలీసులు రంగప్రవేశం చేశారు. లక్ష్మాపూర్ గ్రామస్తులు తెల్లవారుజాము 4.30 గంటల వరకు ఆందోళన చేయగా పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు. ఆ తర్వాత గ్రామస్తులంతా కలిసి చందూర్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలికి వచ్చి బైఠాయించారు. గంటన్నరకు పైగా రాస్తారోకో చేయడంతో రాకపోకలు నిలిచి పోయాయి. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అక్కడకు చేరుకుని గ్రామంలో మాట్లాడుకుందామని చెప్పి వారిని సముదాయించారు. అనంతరం లక్ష్మాపూర్‌కు వెళ్లి స్థానికులతో సమావేశమయ్యారు. అదే సమయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి అక్కడకు చేరుకున్నారు. రెండు గ్రామాల మధ్య నెలకొన్న చెరువు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, అప్పటి దాకా ఎవరూ చెరువు వైపు వెళ్లి సమస్యలు సృష్టించవద్దని రెండు గ్రామాల ప్రజలకు స్పష్టం చేశారు. అనంతరం చెరువులో అక్రమంగా పట్టిన చేపలను అధికారుల సమక్షంలో వేలం వేశారు.



చందూర్ మండల కేంద్రంలో బైఠాయించిన లక్ష్మాపూర్ గ్రామస్తులు

# వరి కోతలు షురూ

- బాన్సువాడ ప్రాంతంలో ముందస్తుగా నాట్లు
- సాగునీటి సమస్యలు తలెత్తక ముందే చేతికొచ్చిన పంట
- ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దళారులు

రుద్రూర్, మార్చి 11: బాన్సువాడ నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఇక్కడి రైతులు యాసంగి ఆరంభానికి ముందే నాట్లు వేస్తారు. వేసవిలో సాగునీటి కష్టాలు ఎదురవకుండా ముందస్తుగా నాట్లు వేయడంతో మార్చి మొదటి వారంలోనే పంట చేతికొస్తుంది. ప్రస్తుతం వరి కోత దశకు చేరుకుంది. దీంతో రుద్రూర్ మండలంలో మంగళవారం నుంచి పంట కోతలు ప్రారంభించారు. అయితే, ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న నమ్మకం లేకపోవడంతో రైతులు పచ్చి ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ధర ఎంతో చెప్పకుండానే దళారులు కాంటా వేసి తరలించుకు పోతున్నారు. ప్రభుత్వం కొంటుందన్న నమ్మకం లేకపోవడం, వాతావరణం సహకరించక పోతే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉండడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. కోసిన ధాన్యం ఆరబెట్టి విక్రయించే దాకా టెన్షన్ పడాల్సి ఉంటుందని రైతు మోహన్‌రావు తెలిపారు. అందుకే ధర తక్కువైనా ఫర్వాలేదని దళారులకే విక్రయిస్తున్నట్లు చెప్పారు.



# కాళ్లకు బేడీలు.. చేతిలో చీపురు

- నిందితుడితో 'క్లీనింగ్'
- హెడ్‌కానిస్టేబుల్ సమక్షంలోనే వెట్టిచాకిరీ
- ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నెటిజన్లు, స్థానికులు

బోధన్, మార్చి 11: బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసులో నిందితుడిగా ఉన్న యువకుడితో చీపురు పట్టించి శుభ్రం చేయించిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో అందరినీ విస్మయానికి గురిచేసింది. బైక్‌ల చోరీ కేసులో నిందితుడిగా బోధన్ మం డలం బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు బోధన్ పోలీసుల కస్టడీలో ఉన్నాడు. విచారణ నిమిత్తం అతడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం ఓ హెడ్‌కానిస్టేబుల్ సమక్షంలో సదరు నిందితుడు కాలికి బేడీలతో చీపురు పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఊడ్చుతున్న వీడియో దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిందితుడి కుడికాలికి బేడీలు వేసి అక్క డే ఉన్న ఒక కుర్చీకి ఆ బేడీలను తగిలిం చి ఉం డడం వీడియోలో కనిపించింది. ఆ వీడియోలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఒకరు నిందితుడితో వెట్టిచాకిరీ చేయిన్నట్లు భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై బోధన్ టౌన్ సీఐ వెంకటనారాయణను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరుగుతున్నదని తెలిపారు.



కాలికి బేడీలతో చీపురుతో ఫ్లోర్‌ను శుభ్రం చేస్తున్న నిందితుడు

# సార్లూ! మీ పోస్టుకు న్యాయం చేయండి..

- ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోరా..?
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టు

మోర్తాడ్, మార్చి11: భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ వాగు నుంచి అనుమతుల పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణాపై ఓ వ్యక్తి చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. 'అధికారులు పట్టించుకోరా? అనుమతుల పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా.. చూసీచూడనట్లుగా ఎందుకు వ్యవహరిస్తున్నారు.. సార్లు .. కొంచెం మీ డ్యూటీకి న్యా యం చేయండి..' అంటూ పెట్టిన పోస్టు చక్కర్లు కొడుతున్నది. బడాభీమ్‌గల్ వాగు నుంచి ఇసుకను తరలించడానికి సోమవారం అనుమతులు ఇచ్చారు. కానీ ఇచ్చిన వేబిల్లులు తక్కువగా ఉన్నప్పటికీ దాదాపు 200 ట్రిప్పుల ఇసుకను తరలించినా పట్టించుకునేవారు లేకపోవడం, ఇసుక దందాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై అధికారులను ప్రశ్నిస్తూ ఓ వ్యక్తి చేసిన పోస్టు సోషల్‌మీడియాలో వైరల్ కావడం గమనార్హం.



బడాభీమ్‌గల్ పెద్దవాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు

**తహసీల్దార్ల బదిలీ**

బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అక్రమ తరలింపు విషయంలో అధికారులు సహకరించకపోతే వారిని బదిలీ చేయించేందుకు కూడా అధికార పార్టీ నేతలు వెనకంజ వేయడం లేదు. ఇప్పటికే మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ, భీమ్‌గల్ తహసీల్దార్ లత బదిలీపై వెళ్లారు. తాజాగా మంగళవారం ఏర్గట్ల తహసీల్దార్ శ్రీలతను కూడా అధికారులు బదిలీ చేశారు. ఇసుక తరలింపు కోసం వేబిల్లులు ఇచ్చేందుకు నిర్మాణంలో ఉన్న ఇండ్ల ఫొటోలు ఇవ్వాలని తహసీల్దార్ కోరడం, ఇసుకాసురులకు ఇబ్బందిగా మారడంతో ఏకంగా తహసీల్దార్‌ను బదిలీ చేయించినట్లు తెలిసింది. భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని వాగులపై కన్నేసిన అధికారపార్టీ నేతలు తమకు సహకరించకుంటే అధికారులను బదిలీలు సైతం చేయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**'ఆ వేబిల్లులతో నాకు సంబంధం లేదు'**

ఏర్గట్ల మండలం బట్టాపూర్ పెద్దవాగు నుంచి ఇసుక తరలింపు కోసం తన పేరుమీద జారీ చేసిన వే బిల్లులతో తనకు ఏమాత్రం సంబంధం లేదని మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మూడు గ్రామాల్లో మద్యపాన నిషేధం

- గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం
- కాదని విక్రయిస్తే రూ.50 వేల జరిమానా
- సమాచారం అందించిన వారికి రూ.8వేలు నజరానా

లింగంపేట, మార్చి 11: గ్రామాల్లో మద్యం విక్రయాలతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. యువకులు మద్యానికి బానిసవుతున్నారు. ఈ నేపథ్యంలో మద్యం విక్రయాలు నిలిపివేస్తూ మూడు గ్రామాలు మంగళవారం తీర్మానం చేశాయి. మండలంలోని కోమట్‌పల్లి, కేశాయిపేట, అన్నారెడ్డిపల్లి గ్రామాల్లో మద్యం విక్రయాలు చేయవద్దని గ్రామస్తులు నిర్ణయించారు. మంగళవారం మూడు గ్రామాలకు చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు కోమట్‌పల్లిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం నుంచి మద్యం విక్రయాలు నిలిపివేయాలని, గ్రామస్తుల నిర్ణయానికి వ్యతిరేకంగా మద్యం విక్రయించిన వ్యక్తికి రూ. 50వేల జరిమానా విధించాలని తీర్మానించారు. మద్యం విక్రయించిన వారి సమాచారం అందించిన వ్యక్తికి రూ. 8వేల నగదు అందించనున్నట్లు మూడు గ్రామాల ప్రజలు తీర్మానం చేయడం గమనార్హం. సమావేశంలో అన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పిట్ల శ్రీశైలం, కేశాయిపేట గ్రామానికి చెందిన పెద్దోళ్ల అల్లూరి, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలు, నాయిని బాల్‌రాజ్‌తోపాటు మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.